సాక్షి నిజామాబాద్

గురువారం। 9। మార్చి। 2023



నేడు వేంకటేశుని రథోత్సవం

మోర్తాడ్‌లోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథోత్సవం, జాతర గురువారం నిర్వహించనున్నారు.

- 8లో ▸



ప్రమాదకరంగా రోడ్డు

మాక్లూర్ మండలం కల్లెడి – గాలిబ్‌నగర్ మార్గంలో కల్లెడి చెరువు కట్ట వద్ద బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.9 /18.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి పూట ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉత్తమ మహిళ ఉద్యోగి అవార్డు



నిజామాబాద్ సిటీ: మహిళ అభివృద్ధి బాలల సంక్షేమ శాఖ(డబ్ల్యూడీ సీడబ్ల్యూడీ) సూపర్ వైజర్ నందిని రాష్ట్రస్థాయి మహిళ ఉద్యోగి అవార్డు అందుకున్నారు. శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో మంత్రి సత్యవత్ రాథోడ్ ఆమెకు ఉత్తమ మహిళ ఉద్యోగి అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని నందిని పేర్కొన్నారు.

రేపు ధాత్రి టౌన్‌షిప్‌లో అవగాహన సదస్సు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం శివారులోని ధాత్రి టౌన్ షిప్‌లో శుక్రవారం రెండో విడత ప్లాట్ల విక్రయానికి సంబంధించి ప్రెస్ బిడ్, అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సమీకృత కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ)లో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో ధాత్రి టౌన్‌షిప్ గురించి పూర్తి వివరాలు తెలపడం జరుగుతుందని, ప్లాట్లు కొనేవారు సదస్సులో తప్పకుండా పాల్గొనాలని కోరారు.

రేపు ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమావేశం

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. బుధవారం ఖిల్లా జూనియర్ కళాశాలలో సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారుల సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 14 తేది నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలను పక్బందీగా నిర్వహించాలన్నారు. శుక్రవారం జరిగే సమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హాజరవుతున్నారని తెలిపారు. మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 54 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమిస్తున్నామని వీరికి శిక్షణ ఇచ్చేందుకుగాను సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

11న టామ్‌కాం డ్రైవ్

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టామ్‌కాం) ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా, యూఏఈలలో వివిధ ఉద్యోగాలకు ఈనెల 11న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని టామ్‌కాం హెచ్‌ఆర్ మేనేజర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ ఐటీఐ క్యాంపస్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలోని భారతీయ రెస్టారెంట్లలో హెచ్‌డీ మెయింటనెన్స్ టెక్నీషియన్, ఫిట్టర్, చెఫ్‌లుగా పనిచేయడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూఏఈలో బ్లాస్టర్, పెయింటర్, క్లీనర్, ఫోర్‌మన్–బ్లాస్టింగ్, ఫోర్‌మన్ ప్లేటర్, జీటీఏడబ్ల్యూ వెల్డర్, ఐటీవీ డ్రైవర్, మెషినిస్ట్–సీఎన్‌సీ, పైప్ ఫిట్టర్, ప్లేటర్ ఫ్యాబ్రికేటర్, సెక్యూరిటీ సిస్టమ్ టెక్నీషియన్, సీనియర్ ఆఫీసర్ –అపరేషన్స్ ఉద్యోగాలకు ఎన్‌రోల్‌ఎంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. టామ్‌కామ్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు https://tomcom.telangana.gov.in/లో సంప్రదించాలని సూచించారు.

బార్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్‌ను ఎన్నికల ప్రధాన అధికారి వెంకట రమణగౌడ్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి శైలేష్ కుమార్ దేశముఖ్ విడుదల చేశారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి, సాంస్కృతిక కార్యదర్శి పదవులకు నామినేషన్ స్వీకరిస్తామని వివరించారు. మరో పదిహేను కార్యవర్గ సభ్యులకు కూడా నామినేషన్ పత్రాల దాఖలుకు అవకాశం ఉందన్నారు. 17, 18 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 21న పరిశీలన, 23న ఉపసంహరణ ఉంటాయని పేర్కొన్నారు. 29న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

గన్ కల్చర్..!



గన్ కల్చర్ జిల్లాలో రోజురోజుకూ పెరగడం సామాన్యుల్లో ఆందోళన కలిగిస్తోంది. తాజాగా అంక్సాపూర్ యూనియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్‌ను అధికార పార్టీకి చెందిన పోచంపల్లి గ్రామ సర్పంచ్ అనంతరావు బెదిరించడం తీవ్ర కలకలం రేపింది. ఈ క్రమంలో బ్యాంకు మేనేజర్ భార్య ఆ గ్రామానికి వెళ్లి తన భర్తకు హానీ జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ వీడీసీ సభ్యులను నిలదీసిన వీడియా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతంలోనూ ఓ సీనియర్ ఎమ్మెల్యే అనుచరుడిగా కొనసాగిన వ్యక్తి రియల్ ఎస్టేట్ దందాల్లో గన్‌తో జరిపిన బెదిరింపులు అంతాఇంతా కాదని అంటున్నారు. లైసెన్స్ లేని గన్‌లు నగరంలో సుమారు 100 పైగా, బోధన్‌లో 50 వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

- గ్రామాలకూ పాకుతున్న మాఫియా సంస్కృతి
- నిజామాబాద్, బోధన్‌లలో లైసెన్స్ లేని గన్‌ల వాడకం
- వేల్పూర్ మండలంలో గన్‌తో బ్యాంక్ మేనేజర్‌ను బెదిరించిన అధికార పార్టీ సర్పంచ్
- కేసు పెట్టేందుకూ భయపడిన బ్యాంక్ మేనేజర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రపంచం గ్లోబలైజేషన్‌కు మారిన తర్వాత మంచి ఎంత చేకూరుతుందో.. చెడు సైతం అంతే పెరుగుతోంది. గతంలో దేశంలో ముంబయి లాంటి నగరాల్లోనే మాఫియా సంస్కృతి, తుపాకుల వాడకం ఉండేది. కాలక్రమంలో ఆ సంస్కృతి రాష్ట్రంలోకి, జిల్లా కేంద్రాలకూ పాకింది. మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో ఏడెనిమిదేళ్ల నుంచి గన్ సంస్కృతి మొదలైంది. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ యూనియన్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్‌ను అధికార పార్టీకి చెందిన సర్పంచ్ గన్‌తో బెదిరించిన ఘటన సంచలనంగా మారింది. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సొంత మండలంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఈ నెల 3న వేల్పూర్ మండలం పోచంపల్లి సర్పంచ్ దేశపాండే అనంతరావు అంక్సాపూర్‌లోని యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్ అవినాష్‌ను బెదిరించాడు. రుణాలు ఇచ్చే విషయంలో, రికవరీ అంశాల్లో చూసీచూడనట్లు ఉండాలని హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో బ్యాంకు మేనేజర్ భార్య ఈనెల 5న పోచంపల్లికి వెళ్లి సర్పంచ్ అనంతరావు నుంచి తమకు హాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ వీడీసీ సభ్యులను నిలదీసింది. గతంలో పనిచేసిన మేనేజర్ల విషయంలోనూ ఇలాగే వ్యవహరించారని ఆమె గగ్గోలు పెట్టింది. గతంలో భరత్ అనే మేనేజర్ అనంతరావు బెదిరింపుల కారణంగా ఏకంగా మూడు నెలల పాటు సెలవుపై వెళ్లినట్లు చెప్పింది. ఇలాంటి బెదిరింపుల వల్ల ఈ ఊరిలోని ఎవరికీ రుణాలు వచ్చే అవకాశం ఉండదని హెచ్చరించింది. చివరకు ఈ మండలంలో బ్యాంకు బ్రాంచ్ సైతం ఎత్తేసినా ఆశ్చర్యం లేదని అంది. ఈ ఘటన నేపథ్యంలో తన భర్త మానసికంగా చాలా కుంగిపోతున్నాడని వాపోయింది. ఇంకా 30 ఏళ్ల సర్వీసు చేయాల్సిన నేపథ్యంలో తమ కుటుంబం భయాందోళనలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో పోచంపల్లి వీడీసీ సభ్యులు, సర్పంచ్ అనంతరావు ఆగడాలపై పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

లైసెన్స్ లేని గన్‌లు?

మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న జిల్లాలో లైసెన్స్ లేని తుపాకుల సంఖ్య గణనీయంగానే ఉన్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ నగరంలో లైసెన్స్ లేని గన్‌లు సుమారు 100 పైగా, బోధన్‌లో 50 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ దందాలో ఈ గన్‌లను పలువురు గతంలో నిజామాబాద్ ఏరియాలో ఉపయోగించారు. భూముల కబ్జాల విషయంలోనూ గన్‌ల వాడకం గతంలో బాగానే జరిగినట్లు పలువురు చెబుతున్నారు. ఏడాది కిందట నిజామాబాద్‌లోని దుబ్బ ఏరియాలో, ఓ సీనియర్ ఎమ్మెల్యే అనుచరుడిగా చలామణి అయిన ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ దందా విషయంలో గన్‌తో బెదిరింపులు చేశాడు. ఈ వ్యక్తి కారణంగా చెడ్డపేరు వస్తుండడంతో సదరు సీనియర్ ఎమ్మెల్యే అతన్ని పక్కకు పెట్టారు. సదరు ఎమ్మెల్యేకు కుడిభుజంగా ఉన్న ఆ వ్యక్తిని ప్రస్తుతం ఉనికిలో లేకుండా చేశారు. ఇక రెండేళ్ల క్రితం ఓ ఏజెన్సీ నిర్వాహకుడు బిల్లులు రావాల్సి ఉందంటూ గన్‌తో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని చెదిరించాడు. అదేవిధంగా రెండు సంవత్సరాల కిందట ఓ రౌడీషీటర్ తన బర్త్‌డే వేడుకల్లో పిస్టల్‌తో గాలిలోకి కాల్పులు చేశాడు. ఈ క్రమంలో అరెస్టు చేసేందుకు పోలీసులు వెళ్లడంతో వారికీ గన్ చూపి బెదిరించాడు. ఈ రౌడీషీటర్ ఇటీవల నగరంలో హత్యకు గురయ్యాడు. ధర్మపురి హిల్స్ ఏరియాలో రియల్ ఎస్టేట్ దందాలో రెండేళ్ల క్రితం ఓ రౌడీషీటర్ గన్‌తో బెదిరింపులు చేశాడు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల కిందట నగరంలోని ఓ బేకరి నడిపే వ్యక్తి సైతం గన్‌తో హల్‌చల్ చేశాడు.

■ నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు సైతం బాగా చోరీ అవుతున్నాయి. ఈ వాహనాలను మహారాష్ట్రలోని నాందేడ్ జాల్నా ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కాగా అక్కడి నుంచి అక్రమంగా గన్‌లు తీసుకొచ్చి జిల్లాలో విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం.



పోచంపల్లిలో సర్పంచ్ తీరుపై వీడీసీ సభ్యులతో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ భార్య(ఫైల్)

మానవత్వం లేకుండా మాట్లాడొద్దు

- బీమా సంస్థ వాదనలపై ధర్మాసనం అభ్యంతరం
- నంబర్ చేసి విచారణ చేపట్టండి
- 'మోటార్ వెహికిల్' పిటిషన్‌లో ట్రయల్ కోర్టుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మోటార్ వెహికిల్ చట్టంలోని ఆర్నెల్ల నిబంధనపై మానవత్వంతో ఆలోచించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ కేసులో ఒకరు మృతి చెందారు.. మరొకరు తీవ్రంగా గాయపడిన విషయాన్ని మర్చిపోవద్దని ప్రతివాదుల(కేంద్రం, బీమా కంపెనీ)కు స్పష్టం చేసింది. ఆర్నెల్ల నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన కేసులో పిటిషన్‌ను నంబర్ చేయాలని ట్రయల్‌కోర్టు (ట్రిబ్యునల్)ను హైకోర్టు ఆదేశించింది. మెరిట్స్ ప్రకారం విచారణ చేపట్టాలని ఆదేశించింది. కౌంటర్ ఫైల్ చేసేందుకు సమయం కావాలని కోరడంతో తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది.

గతేడాది నవంబర్ 10న నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం అమ్రాద్ గ్రామానికి చెందిన అయిటి నవనీత అక్కడి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి ఆర్నెల్లు దాటడంతో పిటిషన్‌ను స్వీకరించేందుకు కోర్టు నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ నవనీత, హన్మాండ్లు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్ తుకారాంజీ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది కురిటి భాస్కర్‌రావు వాదనలు వినిపించారు. మానవతా దృక్పథంతో ఆలోచించి పరిహారం ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బీమా సంస్థ న్యాయవాది వాదనలపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కనీస మానవత్వం లేకుండా మాట్లాడటం సరికాదంది. వాదనలు విన్న ధర్మాసనం.. మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్(నిజామాబాద్)కు కేసును నంబర్ చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

జీజీహెచ్‌లో 'ఆరోగ్య మహిళ' ప్రారంభం

- జిల్లాలో ఆరు మమ్మోగ్రాఫీ స్కానింగ్ మిషన్ల ఏర్పాటు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మహిళ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మహిళ సేవలు ప్రారంభమయ్యాయి. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలను పరీక్షించే ప్రత్యేక స్కానింగ్ మిషన్(మమ్మోగ్రాఫీ)ను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేయగా బుధవారం నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్(బ్రెస్ట్ క్యాన్సర్) లక్షణాలు ఆలస్యంగా బయట పడుతుండడంతో ఇటీవల బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ప్రతి మహిళ ముందస్తుగా మమ్మోగ్రాఫీ పరీక్ష చేయించుకోవడం ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ ను ఆదిలోనే కట్టడి చేసే అవకాశం ఉందని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

జిల్లాలో ఆరు ఆస్పత్రుల్లో..

ఆరోగ్య మహిళ కింద రాష్ట్రంలో మొదటి విడతలో మొత్తం 100 ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఇందులో నిజామాబాద్ జిల్లాకు ఆరు మమ్మోగ్రాఫీ స్కానింగ్ మిషన్లు పంపించారు. ఇందులో జీజీహెచ్ ఆస్పత్రి, ఆరూర్మ్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, మెండోరా ప్రైమరీ హెల్త్ సెంటర్, రుద్రూర్ ప్రైమరీ హెల్త్ సెంటర్, రాకాసీపేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, జిల్లా కేంద్రంలోని సీతారాంనగర్ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఈ స్కానింగ్ మిషన్ ఒక్కొక్కటి దాదాపు రూ. 18 లక్షల వరకు ఉంటుంది.



ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన స్కానింగ్ మిషన్

ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు

మమ్మోగ్రాఫీ స్కానింగ్ మిషన్ ద్వారా మహిళలకు ఎనిమిది రకాల సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి మంగళవారం ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నారు. మహిళలకు నిర్వహించే వైద్య పరీక్షలను ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షించనున్నారు. ఇందులో ఎవరికైనా మెరుగైన వైద్యం అవసరం ఉంటే వారిని పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. వీరి కోసం ఆస్పత్రిలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలందిస్తారు.

కవితకు ఈడీ నోటీసులపై కలకలం

- బీఆర్‌ఎస్ జిల్లా శ్రేణుల్లో కలవరం
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితకు ఈడీ నుంచి నోటీసులు రావడంతో జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో కలకలం నెలకొంది. రాజకీయ వర్గాల్లో ఈ అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఈ కేసులో 11 మంది అరెస్టు కాగా మంగళవారం అరెస్టయిన రామచంద్ర పిళ్లై తాను కవిత బినామీనని చెప్పినట్లు ఈడీ ప్రకటించింది. దీంతో ఈ నెల 9న విచారణకు హాజరు కావాలని కవితకు ఈడీ నోటీసులు జారీ చేసింది. కాగా ఈ నెల 10న చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల విషయమై భారత జాగృతి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు కవిత ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ దీక్షకు 16 పార్టీలను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఈడీ నోటీసులు రావడంతో జిల్లాలో పార్టీ కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. కాగా 15వ తేదీన ఈడీ ముందు హాజరవుతానని కవిత రిక్వెస్ట్ పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో కవిత విషయంలో ఈడీ ఎలా వ్యవహరిస్తుందనే విషయమై జిల్లాలో చర్చ జరుగుతోంది. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య రాజకీయ యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో తాజా నోటీసుల విషయమై న్యాయపరంగా పోరాటం చేయాలని కేసీఆర్ కవితకు సూచించినట్లు తెలుస్తోంది.

లిక్కర్ స్కాంతో తెలంగాణ తలదించుకుంటోంది: ఎంపీ

తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం తెలంగాణ ఢిల్లీకి తలవంచలేదు. అయితే ప్రస్తుతం కవిత ప్రమేయంతో లిక్కర్ స్కాం విషయంలో తొలిసారి దేశం ముందు తెలంగాణ తలదించుకోవాల్సి వచ్చింది. లిక్కర్ స్కాం నేపథ్యంలో హఠాత్తుగా కవిత మహిళా బిల్లు అంశం ఎత్తుకున్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ కేబినెట్‌లో ఒక్క మహిళా మంత్రి లేరు. ఇక గత ఎన్నికల్లో ఓడిపోయి తండ్రి అండతో ఎమ్మెల్సీ అయిన కవిత ఈడీ నుంచి తప్పించుకోలేరు.

మహిళా దినోత్సవం రోజు నోటీసులు సరికాదు : జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ విచారణకు రావాలంటూ ఎమ్మెల్సీ కవితకు మహిళా దినోత్సవం రోజే నోటీసులు ఇవ్వడం సరికాదు. ఇది యావత్ మహిళా లోకాన్ని అవమానపరచడమే. కావాలనే ఇబ్బందులు పెట్టాలని ఈడీ ఇలాంటి చర్యల పాల్పడడం సరికాదు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కవిత ప్రతిపక్ష పార్టీలు, మహిళా సంఘాలతో కలిసి భారత జాగృతి ఆధ్వర్యంలో ఢిల్లీలో దీక్ష చేపట్టనున్న నేపథ్యంలో కేంద్రం ఇలా చేయడాన్ని ఖండిస్తున్నాం.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ ప్రయత్నాలు : ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుతోంది. అంబానీ, అదానీ చేసిన అవినీతిని కప్పిపుచ్చేందుకు లిక్కర్ స్కామ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. బీజేపీ కోట్ల రూపాయలు ఇచ్చి ఇతర రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అక్కడి ప్రభుత్వాలను పడగొట్టింది. అదే ఫార్ములాతో తెలంగాణలో నలుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి ప్రయత్నించి భంగపడింది. ఇక్కడ సిట్ విచారణ చేస్తుండగానే న్యాయస్థానంలో కేసు కొట్టివేయించి సీబీఐకి కేసు అప్పగించారు. ఈ క్రమంలో ప్రజల దృష్టి మరల్చేందుకే లిక్కర్ స్కామ్‌ను తెరపైకి తీసుకొచ్చి మా నాయకురాలు కవిత పేరుపై ఈడీ నోటీసులు ఇప్పించారు. మా నాయకుడు కేసీఆర్ గట్టివాడు కనుకనే కేంద్ర ప్రభుత్వం పప్పులు ఉడకడంలేదు. దీంతో బీజేపీ ఇలాంటి చర్యలకు దిగుతోంది.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ

- సమాజాభివృద్ధిలో వారి పాత్ర ప్రశంసనీయం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో కొనియాడిన వక్తలు



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



మేయర్ నీతూకిరణ్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ తదితరులు

నిజామాబాద్ సిటీ: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకుంటున్నారని, సమాజాభివృద్ధిలో వారు పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, మహిళా సహకార కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలితలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును మహిళలు సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధిని సాధించాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ అమలు చేస్తోందని, నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేస్తోందన్నారు.

రాణిస్తున్న మహిళలు : కలెక్టర్

మహిళలు అన్ని రంగాల్లో ఎంతో చక్కగా రాణిస్తూ, సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రశంసించారు. ఉద్యోగాల నిర్వహణ, క్రీడా రంగంలోనే కాకుండా రక్షణ రంగంలో సైతం సత్తా చాటుకుంటున్నారని కొనియాడారు. మహిళలపై సమాజ దృక్పథంలో చాలా వరకు మార్పు వచ్చిందని, అయితే ఈ మార్పు గ్రామీణ ప్రాంతాల వరకు కూడా విస్తరించబడాలన్నారు. అప్పుడే అన్ని ప్రాంతాల్లోనూ మహిళలకు తగిన గౌరవం, సమానత్వం దక్కుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఐసీడీఎస్ సిబ్బంది మహిళలను చైతన్యపర్చేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం 2018–19, 2019–2020 సంవత్సరాలకు సంబంధించిన వడ్డీ లేని రుణాల కింద జిల్లాకు రూ. 88 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. వీటిని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందన్నారు.

మేయర్ నీతూకిరణ్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మహిళలకు స్థానిక సంస్థల్లో శాసనం ద్వారా యాభై శాతం రిజర్వేషన్ అమలు చేస్తోందని, ఫలితంగా జిల్లాలోని నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్‌తో పాటు, మిగతా మూడు మున్సిపాలిటీల్లోనూ అతివలు చైర్ పర్సన్లుగా చక్కగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలు, మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు సూదం లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధారాణి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, నీరజారెడ్డి, గుజ్జ రాజేశ్వరి, సీడీపీవో ఇందిర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీజీ పరీక్షలకు 62 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 62 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షల్లో 462 మంది విద్యార్థులకు 438 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 562 మందికి 524 మంది హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు.

10న పెన్షనర్ల కుటుంబ సమ్మేళనం



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న శుక్రవారం పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు శాస్త్రుల దత్తాత్రేయరావు, అధ్యక్షుడు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. అసోసియేషన్‌సంఘ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. లింగ సమానత్వం కోసం పాటుపడాలని, సమాన పనికి సమాన వేతనం, మహిళల పట్ల వివక్షతను విడనాడాలని ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎస్ మదన్‌మోహన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు నెమలి అప్పగింత



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్‌లో పంట పొలాల వద్ద బుధవారం స్పృహతప్పి పడిపోయిన నెమలిని గ్రామస్తులు అటవీ అధికారి రత్నయ్యకు అప్పగించారు. వరిపంటకు రైతులు గుళికలు చల్లడంతో ఆ నీటిని తాగిన నెమలి స్పృహ తప్పినట్లు గుర్తించారు. ఉప సర్పంచ్ సాద రమేశ్ ఆధ్వర్యంలో అటవీ అధికారికి గ్రామస్తులు గుమ్ముల గంగాధర్, ఝంబరాతి నవీన్, రాము, రవి అప్పగించారు. నెమలికి చికిత్స చేయించడానికి అటవీ అధికారి వేల్పూర్‌కు తీసుకెళ్లారు.

బస్టాండ్లలో దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో బీ, సీ కేటగిరి బస్టాండ్‌లలో వ్యాపార సముదాయాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎం ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్‌ల పరిధిలో ఖాళీగా ఉన్న స్టాల్స్, బహిరంగ స్థలాల కేటాయింపు కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 13న డిపోలలో తీసుకొని, 14న రీజియన్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అదే సాయంత్రం కార్యాలయంలో టెండర్లు తెరుస్తామని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ నివారణకు గస్తీ బృందాలు

ఎల్లారెడ్డి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల నివారణకు రైతులతో కలిసి విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి చేసి రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్సై గణేష్ సూచించారు. బుధవారం స్థానిక సబ్ స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురవుతున్నందున నివారణకు రైతుల సహకారం తీసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఈ సత్యనారాయణగౌడ్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మాక్లూర్: కల్లెడి నుంచి గాలిబ్‌నగర్ వెళ్లే మార్గంలో తోర చెరువు కట్టపై ఉన్న బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇరుకైన చెరువు కట్టపై నుంచే రోడ్డు వేశారు. ఆర్మూర్ తదితర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఈ మార్గంలోనే నవీపేట, ధర్మాబాద్, మహారాష్ట్రకు వెళ్తుంటారు. 2014 వరకు కంకర రోడ్డుగా ఉన్న రహదారిని 2015లో రూ.35.90 లక్షలు మిషన్ కాకతీయ ద్వారా నిధులు మంజూరు చేసి పునరుద్ధరణ పనులు చేపట్టి బీటీ రోడ్డుగా మార్చారు. అప్పటి నుంచి వాహనాల రద్దీ ఎక్కువ అయింది. ఇటీవల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కొన్ని చోట్ల కట్టపై మట్టి కోతకు గురై రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం ఏమారుపాటుగా ఉన్న ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన ఆర్‌అండ్‌బీ అధికారులు చెరువు కట్టకు రెండు వైపుల హెచ్చరిక బోర్డులు పెట్టారు. వాహనదారులు కట్టపైకి ఎక్కారంటే చాలు దిగే వరకు అరచేతిలో ప్రాణం పెట్టుకొని డ్రైవింగ్ చేయాల్సిందే.. ఎదురుగా వాహనం వస్తే అంతే సంగతులు. రివర్స్ గేరులో ఒక వాహనం వెనక్కి వెళ్లాల్సిందే. ప్రమాదకరంగా మారిన కల్లెడి చెరువు కట్టపై ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు కింద కోతకు గురైన చెరువు కట్ట

కట్ట మీద జాగ్రత్త అని చెబుతారు



కల్లెడి చెరువు కట్టపై ఉన్న బీటీ రోడ్డు మీదాగా ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో వెళ్లాలంటే దూ రమైన సరే డీకంపల్లి నుంచి తిరిగి వెళ్తాం. ఈ ప్రాంతంలో వాహనంతో బయటకు వెళ్లిన ప్రతి ఒక్కరికి అమ్మ, నాన్న చెప్పే మొదటి మాట.. కల్లెడి కట్ట మీదా జాగ్రత అని.. కట్ట దిగే వరకు వాహనాన్ని తీరంగా తీసుకెళ్లు అని చెబుతారు. – సిరికొండ సాయి, కల్లెడి

‘ఆరోగ్య మహిళ’తో ఉచితంగా వైద్య సేవలు



మహిళా ఆరోగ్య హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్ తదితరులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 8 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తుందని తెలిపారు. ప్రతి మంగళవారం పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందస్తుగా ఆరోగ్య సమస్యలను గుర్తించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో మహిళా ఆరోగ్య హెల్ప్ డెస్క్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ ప్రారంభించారు. రిఫరల్ సెంటర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి ప్రారంభించారు.

కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ, కౌన్సిలర్ గెరికంటి స్వప్న పాల్గొన్నారు.

ఇంటికి పయనం..



సుల్తాన్‌నగర్ మీదుగా ఎడ్లబండ్లపై ఇళ్లకు వెళ్తున్న గిరిజనులు

నిజాంసాగర్: ఉపాధి కోసం వలస వెళ్లిన గిరిజన రైతులు ఇంటి బాట పట్టారు. జిల్లాలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, మాగి గాయత్రి కార్మాగారాల పరిధిలో సాగు చేసిన చెరుకు పంటను నరికేందుకు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, కల్హేర్, కంగ్టి, తడ్కల్, సిర్గాపూర్, మనూర్, శంకరంపేట మండలాల నుంచి గిరిజన కుటుంబాలు మూడు నెలల కిందట వలస వెళ్లాయి. చెరుకు క్రషింగ్ దగ్గర పడటంతో రైతు కూలీ కుటుంబాలు ఇంటి బాట పట్టాయి.

ట్రాఫిక్ ఎస్సైని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఖలీల్‌వాడి: యువ న్యాయవాదులు విశ్వక్ సేన్ రాజ్, భాను చందర్ ఆచార్యపై దాడికి పాల్పడిన ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతి డిమాండ్ చేశారు. ఆయనను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని బార్ అసోసియేషన్‌లో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా సమ్మెకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవితం అర్థం కావడం లేదని ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

బాన్సువాడరూరల్: ‘నా గురించి ఎవరూ బాధపడవద్దు.. నా చావుకు నేనే కారణం.. నాకు నా జీవితం అర్థం కావట్లేదు.. అందుకే చచ్చిపోతున్నా.. నేను చచ్చిపోయాకా ఇద్దరు అన్నలు అమ్మనాన్నను బాగా చూసుకోవాలి’ అంటూ సూసైడ్ నోట్ రాసి తిర్మలాపూర్‌కు చెందిన శ్రీకాంత్(22) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వరగంతం గంగారాం తెలిపిన వివరాలు.. శ్రీకాంత్ తన బావ సాయిలు వద్ద అప్పు తీసుకుని నాలుగు నెలల క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ పని దొరకకపోవడంతో ఫిబ్రవరి 13న స్వగ్రామానికి తిరిగి వచ్చేశాడు. అప్పటి నుంచి స్థానికంగా చేద్దామంటే పనిలేదు. దీంతో అప్పు ఎలా తీర్చేదని తరచూ బాధ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున 5గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఉదయం 9గంటల వరకు కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. మేకల కుచ్చ వద్ద వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహ త్య చేసుకున్నట్లు గ్రామస్తులు గుర్తించి కుటుంబ స భ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి



డిచ్‌పల్లి: విద్యార్థులు సైన్స్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఆగస్త్య ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘కాంతి పరావర్తనం, కాంతి వేగం’ అనే అంశాలపై కృత్యాధార పద్ధతిలో విద్యార్థులకు బోధించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ఉచితంగా సైన్స్ పాఠాలు బోధిస్తామన్నారు. డిజిటల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా 8, 9వ తరగతి విద్యార్థులకు 15 ల్యాప్‌టాప్‌లతో పీజీడీసీఏ కోర్సును ఉచితంగా బోధిస్తామని తెలిపారు. హెచ్‌ఎం జనార్ధన్ పాల్గొన్నారు.

అధికారుల నిర్ణయం.. విద్యార్థులకు శాపం

- నాగిరెడ్డిపేట మోడల్ కాలేజీలో బోటనీ లెక్చరర్ లేక ఇబ్బందులు

నాగిరెడ్డిపేట: అధికారులు అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం నాగిరెడ్డిపేట మోడల్ కళాశాల ఇంటర్ బైపీసీ విద్యార్థులకు శాపంగా మారింది. విద్యార్థినులను వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలతో జిల్లాలోని సదాశివనగర్ మోడల్ కళాశాలలోని బోటనీ లెక్చరర్ నరేష్‌ను ఇటీవల అధికారులు డిప్యూటేషన్‌పై నాగిరెడ్డిపేట మోడల్ కాలేజీకి పంపారు. ఈ కాలేజీలో హవర్స్ బేస్డ్ టీచర్(హెచ్‌బీటీ)గా విధులు నిర్వహించే బోటనీ లెక్చరర్ వాయునందరెడ్డిని సదాశివనగర్‌కు పంపారు. అక్కడం వెళ్లడం ఇష్టం లేని ఆయన ఉద్యోగం మానేసినట్లు తెలిసింది. కాగా విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన లెక్చరర్‌ను సస్పెండ్ చేయకుండా మరో కళాశాలకు డిప్యూటేషన్‌పై పంపడమేంటని ప్రశ్నిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో అధికారులు నరేష్ డిప్యూటేషన్‌ను రద్దు చేసి తిరిగి అతన్ని సదాశివనగర్ మండలానికి పంపారు. విషయం తెలుసుకున్న విద్యార్థిసంఘాల నాయకులు సదాశివనగర్‌లో ఆందోళనకు దిగడంతో తప్పనిసరైన పరిస్థితుల్లో నరేష్ సెలవుపై వెళ్లినట్లు తెలిసింది.

నాగిరెడ్డిపేటలో 16 రోజులే హాజరు

బోటనీ లెక్చరర్ నరేష్ జనవరి 19న డిప్యూటేషన్‌పై నాగిరెడ్డిపేట మోడల్ కళాశాలకు వచ్చారు. ఈ నెల 2న డిప్యూటేషన్‌ను అధికారులు రద్దు చేశారు. ఆయన నాగిరెడ్డిపేట కాలేజీలో 16రోజులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగతా రోజులు సెలవులో వెళ్లారు. నరేష్ డిప్యూటేషన్‌ను రద్దు చేయడం, అంతకుముందున్న వాయునందరెడ్డి ఉద్యోగం మానేయడంతో ప్రస్తుతం నాగిరెడ్డిపేట మోడల్ కళాశాలలో బోటనీ లెక్చరర్ పోస్టు ఖాళీ అయింది. ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు బోటనీ సబ్జెక్టులో సందేహాలను నివృత్తి చస లెక్చరర్ అందుబాటులో లేకుండా పోయారు. సదాశివనగర్ మోడల్ కాళాశాలలోనూ జనవరి 20 నుంచి బోటనీ లెక్చరర్ పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు సమాచారం . దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.



నాగిరెడ్డిపేట మోడల్ కళాశాల

నేడు వేంకటేశుని రథోత్సవం



స్వామివారి మూలవిరాట్టు



ఉత్సవాలకు ముస్తాబైన రథం

మోర్తాడ్: కోరిన కోర్కెలు తీర్చుతు భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మోర్తాడ్‌లోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి రథోత్సవం, జాతర గురువారం అర్ధరాత్రి నిర్వహించడానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రాచీన ఆలయాల్లో ఒక్కటైన మోర్తాడ్ వేంకటేశ్వర స్వామి గురించి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తిరుపతి వెళ్లి స్వామివారిని దర్శించుకోలేని ఒక భక్తుడు ప్రార్థించగా పాము రూపంలో సాక్షాత్కరించిన స్వామివారు మోర్తాడ్‌లో కొలువైనట్లు ఒక కథ ప్రచారంలో ఉంది. హోళీ రోజున ధర్మపురిలో శ్రీలక్ష్మి నర్సింహా స్వామికి నిర్వహించే డోలోత్సవంలో పాల్గొనే స్వామివారు పండుగ అనంతరం మోర్తాడ్‌లో నిర్వహించే రథోత్సవానికి హాజరు అవుతారని భక్తుల నమ్మకం. అందుకే డోలోత్సవానికి ధర్మపురి వెళ్లిన భక్తులు రథోత్సవంలో పాల్గొనడానికి మోర్తాడ్‌కు రావడం సాంప్రదాయంగా వస్తుంది. మోర్తాడ్ వేంకటేశ్వర స్వామి ఆలయ వెనుక భాగంలో శిలా శాసనం రాసి ఉంది. ఇది ఆలయ చరిత్రను వర్ణించడానికి రాసినట్లు పూర్వీకులు చెబుతున్నారు. వారం రోజుల కింద మొదలైన బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రతీర్థం, నాగవెళ్లి, ఏకాంత సేవలతో ముగియనున్నాయి. రథోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీపీ నాగరాజు

ఖలీల్‌వాడి: మహిళలు అన్ని రంగాల్లో మగవారితో సమానంగా రాణిస్తున్నారిని సీపీ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం లక్ష్మి కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బంది, కాలేజీ విద్యార్థులతో కార్యక్రమం ఏర్పాటు చేసి కేక్ కట్‌చేశారు. సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆనందంగా స్వేచ్ఛగా జీవితంలో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం మహిళల భద్రత కోసం షీ టీమ్, భరోసా, పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేక మహిళా విభాగం ఏర్పాటు చేసిందన్నారు. నగరంలో త్వరలోనే భరోసా సెంటర్ అందుబాటులోకి తెస్తున్నామని, అందులో వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళలు సభ్యులుగా చేరుస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ తమ ఆలోచనలను పంచుకునే వారు లేకనే యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. మహిళలు మనోధైర్యాన్ని కోల్పోకుండా అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి జయసుధ మాట్లాడుతూ మహిళలు లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. అదనపు డీసీపీ గిరిరాజు, ఏసీపీలు కిరణ్ కుమార్, నారాయణ, సంతోష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, పోలీస్ యూనిట్ అధికారి సరళ, మహిళా ఆర్‌ఎస్సై ప్రవంతి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఐ అధికారి శివారెడ్డి

డిచ్‌పల్లి: ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించినప్పుడు సైబర్ మోసాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వీటిపై బ్యాంకు ఖాతాదారులు జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (హైదరాబాద్) అధికారులు సీహెచ్ శివారెడ్డి, అరవింద్ సూచించారు. డిచ్‌పల్లిలోని బెటాలియన్‌లో బుధవారం కమాండెంట్ ఎన్‌వీ సత్యశ్రీనివాసరావు అధ్యక్షతన ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీఐ అధికారులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లావాదేవీలు జరపడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫోన్లకు వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని, లాటరీల పేరుతో వచ్చే మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దని సూచించారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ వెంకటేశ్వర్లు, ఆంజనేయరెడ్డి, సిబ్బంది, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బెటాలియన్ అధికారులు, సిబ్బంది, మోడల్ స్కూల్ విద్యార్థులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాచారెడ్డి: భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండరామేశ్వరపల్లి గ్రామానికి చెందిన గోజురు మైసయ్య(40) ఆర్థిక ఇబ్బందులతో భార్యతో గొడవ పడి ఈ నెల 6న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్ల ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పోచంపల్లి సర్పంచ్ అరెస్టు

వేల్పూర్: అంక్సాపూర్ యూనియన్ బ్యాంకు మేనేజరు అవినాష్‌ను ఎయిర్‌గన్‌తో బెదిరించిన పోచంపల్లి సర్పంచ్ దేశ్‌పాండే అనంతరావును బుధవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల అనంతరావు అంక్సాపూర్ యూనియన్ బ్యాంకులో అక్రమంగా చొరబడి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు, ఎయిర్‌గన్‌తో బెదిరించినట్లు మేనేజరు మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. అయన ఫిర్యాదుతో అనంతరావును అరెస్టు చేశామన్నారు. కొన్నేళ్ల కింద అనంతరావు ఎయిర్‌గన్‌ను కొనుగోలు చేసుకొని ఉంచుకున్నాడన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: పొతంగల్ మండలం సుంకిని నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఉంచగా కోటగిరి మండలం ఎత్తొండ క్యాంపు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుబడింది. ట్రాక్టర్‌ను తహసీల్ కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు ఉంటాయని తహసీల్దార్ శ్రీకాంత్‌రావు హెచ్చరించారు.

ఉపాధ్యాయుడి అదృశ్యం

నందిపేట్: నందిపేటకు చెందిన వాసన్ ముఖేష్ అదృశ్యమయ్యాడు. ముఖేష్ సదాసివనగర్ మండలం ఫకీర్‌నాయక్ తండాలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ప్రతిరోజు ఇంటి నుంచి వెళ్లి వచ్చేవాడు. గత నెల 27న ఉదయం పాఠశాలకు వెళ్తున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు.

సరంపల్లిలో యువకుడు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం సరంపల్లి గ్రామానికి చెందిన పోల్ రాజేష్ కుమార్ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఏ పని చేయడం లేదని, మద్యం తాగుతున్నాడని ఈనెల 6న రాజేష్ కుమార్‌ను అతని తండ్రి లింగం మందలించాడు. దీంతో కొద్దిసేపటి తర్వాత రాజేష్‌కుమార్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో లింగం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

రాజంపేట: పెండింగ్‌లో ఉన్న చలానాలను వాహనదారులు సకాలంలో చెల్లించాలని లేకపోతే 200 శాతం అదనపు రుసుం విధిస్తామని రవాణశాఖ సహాయ అధికారి శ్రీనివాస్ రావ్ సూచించారు. బుధవారం మండలంలోని ఆర్గొండ గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్సై రాజు, ఏఎస్సై గంగారెడ్డి ఉన్నారు.

10 మందిపై కేసు నమోదు

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో గుంజె లక్ష్మణ్‌కు చెందిన స్థలంలో నిర్మాణం చేపడుతుండగా అడ్డుపడిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు. లక్ష్మణ్‌కు చెందిన స్థలంలో 2022 డిసెంబర్ 23న రాత్రి సమయంలో ప్రహారీ నిర్మించారని పేర్కొన్నారు. మరుసటి రోజున పది మంది ఆ ప్రహారీని కూల్చారని తెలిపారు. బాధితుడు కోర్టును ఆశ్రయించగా అడ్డుపడిన పది మందిపై కేసు నమోదు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. జడ్జి ఆదేశాల మేరకు నిర్మాణాన్ని కూల్చిన పది మందిపై కేసు నమోదు చేశామన్నారు.

దాడి చేసిన ముగ్గురిపై..



గాయపడిన గోవింద్

సిరికొండ: మండలంలోని నిదుప్య తండాకు చెందిన మలావత్ గోవింద్‌పై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు బుధవారం తెలిపారు. భూమి విషయంలో మంగళవారం రాత్రి గోవింద్‌పై తండాకు చెందిన బుక్య మురారి, బుక్య రవి, బుక్య రమేష్ దాడి చేసి గాయపర్చారని ఎస్సై తెలిపారు. బాధితుడి భార్య మంగి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. బాధితుడు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు.